సాక్షి మంచిర్యాల

ఆదివారం । 18 । ఫిబ్రవరి । 2024



గూడెం 'గూడు' కట్టుకుంది

ఓ గూడెంలో పట్టు తప్పిన పటేల్‌ను కాదని ఊరే తరలిపోయింది. కొత్తగా గూడేన్ని నిర్మించుకుంది. సిరికొండ మండలం పాండుగూడ కొనుపటేల్‌గూడగా మారిన తీరుపై కథనం..

8లో▸



అనుమతుల మాటున అక్రమ రవాణా

జిల్లాలో ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. ఇసుక రీచ్‌కు అనుమతి రాకముందే చేసిన డంపులను అమ్ము, సొమ్ము చేసుకుంటున్నారు.

8లో▸

గరిష్ఠం/కనిష్ఠం
36.3 /21.1

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. అప్పుడప్పుడు మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం వేడిగా ఉంటుంది. రాత్రి చలి ప్రభావంత తగ్గుతుంది.

న్యూస్‌రీల్

భక్తులకు సదుపాయాలు కల్పించాలి



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ బి. సంతోష్

మంచిర్యాలఅగ్రికల్చర్: ఈ నెల 21 నుంచి 24 వరకు జరిగే సమక్క–సారలమ్మ జాతరలో భక్తులకు సదుపాయాలు కల్పించాలని కలెక్టర్ బి.సంతోష్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని గోదావరి నదీ తీరంలో సమక్క–సారలమ్మ గద్దెల వద్ద ఏర్పాట్లను డీసీపీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్, ఏసీపీ ఆర్.ప్రకాష్, మంచిర్యాల తహసీల్దార్ కే.రమేష్, మంచిర్యాల మున్సిపల్ కమిషనర్ మారుతిప్రసాద్‌తో కలిసి పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ సమ్మక్క–సారలమ్మ జాతరను అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ఘనంగా నిర్వహించాలని అన్నారు. భక్తులకు తాగునీరు, టెంట్లు, గద్దెల వద్ద బారికేడ్లు ఏర్పాటు చేసి వాలంటీర్లను నియమించాలని, పోలీసు బందోబస్తు, వాహనాల పార్కింగ్ కోసం ప్రత్యేక స్థలాన్ని ఏర్పాటు చేయాలని చెప్పారు. గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని, ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా, పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

చదువుతోనే సమాజంలో గుర్తింపు



మాట్లాడుతున్న అసదుల్లా షరీఫ్


లక్సెట్టిపేట: చదువుతోనే సమాజంలో గుర్తింపు లభిస్తుందని మున్సిఫ్ మేజిస్ట్రేట్ కోర్టు జూనియర్ సివిల్ జడ్జి మహ్మద్ అసదుల్లా షరీఫ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల బాలికల పాఠశాలలో ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడారు. విద్యార్థులు చిన్నప్పటి నుంచి కష్టపడి చదివి ఉద్యోగం సంపాదించాలని అన్నారు. విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని, సమాజంలో ఏవైనా ఇబ్బందులు వస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. అనంతరం మహిళా హక్కులు, చట్టాలు వాటి వల్ల కలిగే ఉపయోగాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏజీపీ పద్మ, సీనియర్ న్యాయవాదులు అక్కల శ్రీధర్, గడికొప్పుల కిరణ్, సునీల్, ప్రిన్సిపాల్ నాగప్రమోద పాల్గొన్నారు.

3న రెడ్‌క్రాస్ ఎన్నికలు

మంచిర్యాలటౌన్: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మంచిర్యాల బ్రాంచ్ ఎన్నికల షెడ్యూల్‌ను ఎన్నికల అధికారి, జిల్లా సహకార సంఘ అధికారి జే.నర్సయ్య శనివారం విడుదల చేశారు. మార్చి 3న చున్నంబట్టి వాడ వంద ఫీట్ల రోడ్డులో ఉన్న లయన్స్ భవన్‌లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం వరకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 4,367 మంది రెడ్‌క్రాస్ సభ్యులు ఉన్నారని తెలిపారు. ఈ నెల 22న ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు జిల్లా సహకార అధికారి కార్యాలయం, ఎస్ 1, 2వ ఫ్లోర్, ఇంటిగ్రేటెడ్ డిస్ట్రిక్ట్ ఆఫీసర్స్ కాంప్లెక్స్, నస్పూరులో నామినేషన్లు స్వీకరిస్తారని తెలిపారు. రూ.3,500 చెల్లించాల్సి ఉంటుందని, 23న ఉదయం 11 గంటల నుంచి పరిశీలించి, మధ్యాహ్నం 2 గంటలకు జాబితా ప్రకటిస్తారని తెలిపారు. 24న నామినేషన్ల ఉపసంహరణ, అదే రోజు మధ్యాహ్నం అర్హులైన జాబితా ప్రకటన, ఎన్నికల గుర్తుల కేటాయింపు ఉంటుందని తెలిపారు. మార్చి 3న ఎన్నికల అనంతరం మధ్యాహ్నం 3 గంటలకు కౌంటింగ్, ఫలితాల ప్రకటన, 4న ఉదయం 11 గంటలకు ఆఫీసు బేరర్ల ఎన్నిక ఉంటాయని తెలిపారు.

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి

- అడిషనల్ కలెక్టర్ మోతిలాల్



అక్షరాభ్యాసం చేయిస్తున్న అడిషనల్ కలెక్టర్

భీమిని: మహిళలు అక్షరాస్యులుగా మారి అన్ని రంగాల్లో రాణించాలని జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్ అన్నారు. శనివారం కన్నెపల్లి మండల కేంద్రంలోని రైతువేదికలో నిరక్షరాస్యులకు చదువు నేర్పే అక్షరాస్యత కేంద్రం, మహిళలకు కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ శిక్షణ కేంద్రాలను జిల్లా వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో మంచిర్యాల లయన్స్ క్లబ్ ఆఫ్ సఖి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినందుకు అభినందించారు. నిరక్షరాస్యులైన మహిళలకు అక్షరాస్యులైన మహిళలు చదువు నేర్పుతూ వారి స్వయం ఉపాధి కోసం పాటుపడాలన్నారు. వందరోజుల్లో వందశాతం అక్షరాస్యత కన్నెపల్లి సాధించేలా చూడాలని తెలిపారు.


జన్నారం మండలం పొన్కల్‌కు చెందిన సయ్యద్ రహిముల్లా బట్టల వ్యాపారి. స్థానికంగా ఓ మెడికల్ షాపు నిర్వహిస్తున్న దావరశెట్టి శ్రీధర్ వద్ద రూ.5లక్షలకు చిట్టీ వేశాడు. చిట్టీ తీసుకునే సమయంలో ప్రామిసరీ నోట్‌తోపాటు బ్లాంక్ చెక్కులు ఇచ్చాడు. చిట్టీ కాల పరిమితి ముగిసినా రహిముల్లాకు చెక్కులు ఇవ్వలేదు. రహిముల్లా పట్టించుకోకపోయేసరికి కొన్నాళ్లకు కరీంనగర్‌లోని ఎస్‌బీఐ నుంచి రూ.2.50లక్షలు విత్‌డ్రాకు ప్రయత్నించారు. ఖాతాలో డబ్బులు లేకపోయే సరికి నోటీసులు వచ్చాయి. తాను ఎప్పుడో కట్టిన చిట్టీకి సంబంధించిన చెక్కులు తనకు ఇవ్వకుండా డబ్బు విత్‌డ్రాకు ప్రయత్నించిన చిట్టీ నిర్వాహకుడిపై చర్యలు తీసుకోవాలని రెండ్రోజుల క్రితం స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

జిల్లా కేంద్రంలోని బెల్లంపల్లి చౌరస్తా సమీపంలో ఉన్న కనకదుర్గ చిట్‌ఫండ్ కంపెనీలో జిల్లాలో అనేక మంది చిట్టీలు కట్టారు. చాలామందికి చిట్టీ సమయం ముగిసినా కూడా ఇప్పటికీ డబ్బులు ఇవ్వలేదు. దీంతో బాధితులు చిట్టీ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. కార్యాలయం బోర్డు తిప్పేయడంతో చిట్స్ కట్టిన వారంతా లబోదిబోమంటున్నారు. ఈ చిట్టీలు కట్టించింది ఓ వ్యవసాయ శాఖ అధికారి భార్య కావడం గమనార్హం.

జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తా వద్ద ఉన్న ఓ చిట్ కంపెనీ సైతం మంచిర్యాల, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాల ప్రజల నుంచి చిట్స్ కింద డబ్బులు వసూలు చేసింది. తీరా చిట్స్ తీసుకునే సమయానికి ఇవ్వకుండా నానా ఇబ్బందులకు గురి చేస్తున్నారు. దీనిపై అప్పట్లో ఆసిఫాబాద్ నుంచి ఓ బాధితుడు అక్కడి పోలీసుస్టేషన్‌లోనూ ఫిర్యాదు చేశాడు.

చిట్టీలు.. చీట్ చేస్తున్నారు!

- పుట్టగొడుగుల్లా చిట్‌ఫండ్ కంపెనీలు
- ఇప్పటికే పలుచోట్ల కార్యాలయాలు ఎత్తివేత
- అనధికార చిట్టీలతోనూ నష్టం
- జిల్లాలో పెరుగుతున్న ఆర్థిక మోసాలు



సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: జిల్లాలో అధికార, అనధికారిక చిట్టీల వ్యాపారంతో అమాయకులు ఎంతోమంది ఆర్థికంగా నష్టపోతున్నారు. చట్ట ప్రకారం నిర్వహిస్తున్న కంపెనీలు సైతం కొన్ని సార్లు బోర్డులు తిప్పేస్తున్నాయి. మరికొన్ని చోట్ల మండలాలు, గ్రామాల్లోనూ అనధికారికంగా చిట్టీలు వేస్తున్నారు. చిట్టీలు వేసే క్రమంలో కాల పరిమితి ముగిసినప్పటికీ చాలా ఇబ్బందులకు గురి చేస్తున్నారు. దీంతో ఎటూ చెప్పుకోలేక బాధితులు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. కొన్ని చోట్ల పోలీసుస్టేషన్లలోనూ ఫిర్యాదులు నమోదవుతున్నాయి.

అడ్డగోలుగా కంపెనీలు..

జిల్లా కేంద్రంతోపాటు పట్టణాల్లోనూ తమ బ్రాంచీలు ఏర్పాటు చేసుకుని చిట్స్ కంపెనీలు వెలుస్తున్నాయి. అధిక లాభాలు ఆశ చూపించి తమ ఏజెంట్లతో డబ్బులు వసూలు చేశాక చేతులెత్తేస్తున్నారు. రూ.కోట్లు వసూలు చేశాక నష్టాలు వచ్చాయని, కొందరు సరిగా చిట్టీలు కట్టడం లేదని చెబుతూ మోసాలకు తెర తీస్తున్నారు. తీరా వివరాల కోసం వెళ్లినా కనీస సమచారం ఇచ్చేవారు సైతం ఉండడం లేదు. దీంతో బాధితులు రూ.లక్షలు కట్టి తమ డబ్బులు తాము తీసుకోలేని స్థితిలో ఉంటున్నారు. చిట్స్ కంపెనీలు రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖ పరిధిలో ఉంటాయి. ఇందుకోసం చిట్స్ రిజిస్ట్రార్ ప్రత్యేకంగా ఉంటారు. ఉమ్మడి జిల్లా పరిధిలో ఆదిలాబాద్ కేంద్రంగా ఉండడంతో చాలామంది అక్కడి వరకు వెళ్లి కనీస ఫిర్యాదు సైతం చేయడం లేదు. దీంతో చాలా కంపెనీలపై ఎలాంటి చర్యలు ఉండడం లేదు.

అనుమతి లేనివే అధికం

ఇక గ్రామాలు, మండలాలు, పట్టణాల్లో తమకు తెలిసిన వారి వద్ద చిట్టీలు వేస్తూ నష్టపోతున్న వారూ ఉన్నారు. గని కార్మికవాడలు, మహిళలు, వ్యాపారులు, ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు, వివిధ వృత్తుల్లో ఉన్న వారు చిట్టీలు వేస్తున్నారు. తమకు తెలిసిన వారనే నమ్మకంతో ఉంటున్నారు. ఎక్కడైనా సమస్య ఏర్పడిన అనధికారికంగా వేయడంతో ఎక్కడా ఫిర్యాదు చేసే అవకాశం కూడా లేకుండా పోతోంది. జిల్లాలో 20పైగా చిట్టీ కంపెనీలు, అనధికార చిట్టీలు నష్టపోయినట్లు అంచనా. కోవిడ్ సమయంలో చాలామంది డబ్బులు కట్టలేక, కట్టిన డబ్బులు తీసుకోలేక నష్టపోయారు. ఇప్పటికీ అనేక చోట్ల ఇదే తీరుగా మోసాలు జరుగుతూనే ఉన్నాయి. ఇందులో కొందరు కాలపరిమితి ముగిశాక డబ్బులు ఇవ్వని వారు, కొందరు డబ్బులు కట్టి తీసుకోకుండా నష్టపోయిన వారు ఉన్నారు. వీటిపై పోలీసు, రిజిస్ట్రేషన్ శాఖ నుంచి ప్రజల్లో అవగాహన పెంచి, ఆర్థికంగా నష్టపోకుండా చూడాలని బాధితులు కోరుతున్నారు.

దండేపల్లి ఎస్సై సస్పెన్షన్

- విధుల్లో నిర్లక్ష్యం
- అవినీతి ఆరోపణలు



సాక్షి ప్రతినిధి, మంచిర్యాల /దండేపల్లి: జిల్లాలోని దండేపల్లి ఎస్సై కళ్యాణం నరేశ్‌పై సస్పెన్షన్ వేటు పడింది. కన్నెపల్లి పోలీసుస్టేషన్‌లో **ఎస్సై నరేష్..** విధులు నిర్వర్తిస్తున్న సమయంలో ఆయనపై పలు ఆరోపణలు రావడంతో వేటు పడింది. భూ వివాదాలు, నకిలీ పత్తి విత్తనాల కేసు, పీడీఎస్ రైస్ అక్రమ రవాణా తదితర వాటిపై విధుల్లో నిర్లక్ష్యం వహించడంతోపాటు కొందరికీ లబ్ధి చేకూరేలా అవినీతికి పాల్పడినట్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెళ్లాయి. మండలంలో జజ్జరపల్లిలో ఓ భూ వివాదంతో తలదూర్చి ఒక వర్గానికి మేలు చేసేందుకు ప్రయత్నించడంతో బాధితులు మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించారు. వీటితోపాటు ఇటీవల నకిలీ పత్తి విత్తనాల కేసులోనూ నిందితులతో లోపాయికారీ ఒప్పందం చేసుకుని, వాళ్లని కాపాడే ప్రయత్నం చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. విధుల్లో పలు అవినీతి ఆరోపణలు రావడంతో ఉన్నతాధికా రులు విచారణ జరిపించారు. ఆరోపణలు నిజమేనని తేలడంతో సస్పెన్షన్ వేటు పడింది. నరేశ్ కన్నెపల్లి ఎస్సైగా గత ఏడాది ఏప్రిల్‌లో విధుల్లో చేరి, ఈ నెల 12 వరకు పని చేసి ఇటీవలే దండేపల్లికి బదిలీపై వెళ్లారు. సస్పెన్షన్‌కు కారణంపై డీసీపీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్‌ను సంప్రదించగా.. శాఖపరమైన అంతర్గత విషయమని చెప్పేందుకు నిరాకరించారు.

28 నుంచి ఇంటర్ పరీక్షలు

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో ఈ నెల 28 నుంచి మార్చి 16వరకు ఇంటర్మీడియట్ పరీక్షలు నిర్వహించనున్నట్లు డీఐఈవో ఆర్.శైలజ ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఈ నెల 28 మార్చి 1, 4, 6, 11, 13, 15, 18 తేదీల్లో, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఈ నెల 29, మార్చి 2, 5, 7, 12, 14, 16, 19 తేదీల్లో పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ నెల 20న మధ్యాహ్నం 3గంటలకు కలెక్టరేట్‌లో ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణపై సన్నాహక సమావేశం నిర్వహిస్తామని, అధికారులు హాజరు కావాలని తెలిపారు.

బదిలీ వేళ అనుమతులు

- నస్పూర్ పట్టణంలో ఇంటి పర్మిషన్లపై అనుమానాలు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: నస్పూర్ పట్టణ పరిధిలో ఒకే రోజు తొమ్మిది ఇంటి నిర్మాణాలకు అనుమతి ఇవ్వడంపై ఫిర్యాదులు వస్తున్నాయి. పట్టణ కమిషనర్‌గా పని చేసిన తన్నీరు రమేశ్ ఈ నెల ఒకటి నుంచి 14వరకు మెడికల్ లీవ్‌లో ఉన్నారు. 14న విధుల్లో చేరి, 15న రిలీవ్ అయ్యారు. అదే రోజు కొత్త కమిషనర్ సతీశ్ బాధ్యతలు చేపట్టారు. రిలీవ్ అయ్యే ముందు రోజే అంటే 14న ఒక్క రోజే రాత్రి వరకు తొమ్మిది ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు ఇవ్వడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మరో వైపు ఈ నెల 13న రాష్ట్రంలో పలువురు కమిషనర్ల బదిలీపై ఆర్డర్లు వచ్చాయి. అంటే పాత కమిషనర్ లీవ్ ఉన్న సమయంలోనే బదిలీల ఆర్డరు వచ్చింది. ఆ మరుసటి రోజే డ్యూటీకి వచ్చి అనుమతులు ఇచ్చారు. నిబంధనల ప్రకారం టీఎస్‌బీపాస్(తెలంగాణ స్టేట్ బిల్డింగ్ పర్మిషన్ అప్రూవల్ అండ్ సెల్ఫ్ సర్టిఫికేషన్ సిస్టం) ప్రకారం 500చదరపు మీటర్ల విస్తీర్ణం, 10మీటర్ల ఎత్తు ఉన్న నిర్మాణాలకు 21రోజుల్లో అనుమతులు ఇవ్వాలి. నిబంధనల ప్రకారం లేకపోతే తిరస్కరించాలి. నిర్ణీత సమయంలోపు అనుమతులు ఇవ్వకపోతే కమిషనర్ ఎందుకు జాప్యం చేశారో వివరణ ఇవ్వాల్సి ఉంటుంది. బదిలీపై వెళ్లిన కమిషనర్ తొమ్మిది ఇళ్ల అనుమతుల్లో ఈ నెల1, 5న దరఖాస్తు చేసిన వాటితోపాటు గత నెల 24, 27వ తేదీల్లో దరఖాస్తు చేసుకున్నవీ ఉన్నాయి. సెలవు నుంచి వచ్చిన అధికారి ఆగమేఘాలపై ఎందుకు సాయంత్రం నుంచి రాత్రి వరకు అనుమతులు ఇచ్చారు..? రాజకీయ ఒత్తిళ్ల లేక, ప్రలోభాలు ఉన్నాయా? అనే సందేహాలు ఉన్నాయి. దీనిపై బదిలీపై వెళ్లిన కమిషనర్ రమేశ్‌ను 'సాక్షి' సంప్రదించగా, తన లాగిన్‌లో పెండింగ్‌లో ఉన్న వాటిని క్లియర్ చేసేందుకే అనుమతులు ఇచ్చానన్నారు. జీత భత్యాలు, ఇతర వాటిని కూడా క్లియర్ చేశానని తెలిపారు. ఇందులో తమపై ఆరోపణలు అర్థం లేనివని చెప్పారు. మరోవైపు బదిలీపై వెళ్లే సమయంలో కమిషనర్ కొంతమందికి కావాలనే లబ్ధి చేకూరేలా వ్యవహరించారని, దీనిపై విచారణ జరపాలని ఆమ్ ఆద్మీ పార్టీ నాయకుడు నయిం పాషా ఆరోపించారు.



నస్పూర్ మున్సిపల్ కార్యాలయం

మెట్టు మేడారం ముస్తాబు

- జాతరకు ఏర్పాట్లు



సుబ్బరాంపల్లిలో ముస్తాబైన సారలమ్మ గద్దె

చెన్నూర్‌రూరల్: మండలంలోని సుబ్బరాంపల్లి గ్రామంలో ఉన్న సమ్మక్క, సారలమ్మ గద్దెలకు ఎంతో చరిత్ర ఉంది. పుట్టు సుబ్బరాంపల్లి మెట్టు మేడారంగా పేరొందింది. గత ఐదు దశాబ్దాలుగా మేడారంలో నిర్వహించినట్లే ప్రతీ రెండేళ్లకోసారి జాతర నిర్వహిస్తున్నారు. ప్రతియేటా కూడా పౌర్ణమికి జాతర సాగుతుంది. జిల్లాతోపాటు మంథని, కరీంనగర్, మహారాష్ట్రలోని అంకీస, అసరెల్లి ప్రాంతాల నుంచి భక్తులు వస్తుంటారు. చిన్నపిల్లల పుట్టువెంట్రుకలు సమర్పిస్తారు. మొదట మారిశెట్టి రామయ్య పూజలు చేస్తుండేవాడు. ప్రస్తుతం ఆయన కూతురు, అల్లుడు తనుగుల మల్లక్క, లచ్చన్న పూజలు కొనసాగిస్తున్నారు. వీటితోపాటు కిష్టంపేట సమీపంలోని జాతీయ రహదారిపై జాతర నిర్వహణకు సిద్ధం చేశారు. ఈ నెల 21 నుంచి 23వరకు నిర్వహించే జాతరకు గద్దెలు ముస్తాబు చేశారు. 21న కంకవనం, సమ్మక్కను గద్దెకు తీసుకొస్తారు. 22న సారలమ్మ గద్దెపైకి వస్తారు. భక్తులు బోనాలు చేసి, మేకలు, కోళ్లు బలి ఇచ్చి మొక్కులు తీర్చుకుంటారు.

నేటి నుంచి వన జాతరకు బస్సులు

- ఆరు బస్‌పాయింట్ల నుంచి రాకపోకలు
- మహిళలకు ఉచిత ప్రయాణం

మంచిర్యాలఅర్బన్: సమ్మక్క–సారలమ్మ వన జాతరకు సింగరేణి ప్రాంతం నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడిపిస్తోంది. ఆదివారం నుంచి బస్సుల రాకపోకలు ప్రారంభం కానున్నాయి. మంచిర్యాల, బెల్లంపల్లి, మందమర్రి, శ్రీరాంపూర్, చెన్నూర్‌తోపాటు ఆసిఫాబాద్ నుంచి మేడారం మహా జాతరకు ప్రత్యేక బస్సుల ద్వారా భక్తులను చేరవేయనుంది. కార్మిక క్షేత్రం మంచిర్యాల జిల్లా నుంచే భక్తులు అధికంగా జాతరకు వెళ్లి వస్తుంటారు. ఈ నేపథ్యంలో అమ్మవార్ల జాతరకు ప్రయాణికుల సౌకర్యార్థం బస్టాండ్ల(పాయింట్ల) నుంచి బస్సులు నడిపించనున్నారు. మంచిర్యాల బస్టాండ్‌లో ఇరుకుగా ఉన్న నేపథ్యంలో ఈ ఏడాది జాతరకు బాలు ర ఉన్నత పాఠశాల మైదానంలో పాయింట్ ఏర్పాటు చేశారు. ఆయా పాయింట్ల వద్ద టెంట్లు, ఇతరత్రా సౌకర్యాలు కల్పించారు. భక్తులు వరుస క్రమంలో వెళ్లేలా క్యూలైన్లు, ఎప్పటికప్పుడు సమాచారం అందించనున్నారు. జాతరకు వెళ్లే మహిళలకు ఉచిత ప్రయాణానికి అవకాశం కల్పించారు. ఈ నెల 18నుంచి 24 వరకు ఆర్టీసీ బస్సులు రాకపోకలు సాగించనున్నాయి.

మేడారం వైపు బారులు

బస్సులన్నీ మేడారం బారులు తీరనున్నాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి 365 బస్సులు నడిపిస్తున్నారు. ఇందులో జిల్లా కేంద్రమైన మంచిర్యాల డిపోకు చెందిన మంచిర్యాల బస్‌స్టేషన్(బాయ్స్ హైస్కూల్ గ్రౌండ్) నుంచి 110 బస్సులు మేడారం జాతరకు నడిపించనున్నారు. ఆదిలాబాద్ డిపోకు చెందిన 65 బస్సులను చెన్నూర్ పాయింట్ నుంచి, ఆసిఫాబాద్ డిపోకు ఆసిఫాబాద్, బెల్లంపల్లి పాయింట్ల(బస్టాండ్) నుంచి 70(ఉట్నూర్ డిపో బస్సులు–10) బస్సులు, భైంసాకు చెందిన 45 బస్సులను శ్రీరాంపూర్ పాయింట్(బస్టాండ్), నిర్మల్ డిపోకు చెందిన 65 బస్సులను మందమర్రి పాయింట్ (బస్టాండ్ వద్ద) నుంచి నడిపించనున్నారు. రద్దీకి అనుగుణంగా ప్రత్యేక బస్సులు నడపనున్నామని మంచిర్యాల డిపో మేనేజర్ రవీంద్రనాథ్ తెలిపారు.



ఏర్పాటు చేసిన టెంట్, క్యూలైన్లు

సింగరేణి సూపర్‌బజార్ మూత!

- ఐదు నెలలుగా తెరుచుకోని తాళాలు
- సేల్స్‌మెన్ అవకతవకలతో మూసివేత ఆలోచన
- సరుకుల కోసం కార్మికుల ఇబ్బందులు

బెల్లంపల్లి: బెల్లంపల్లిలోని సింగరేణి సూపర్‌బజార్ మూతపడింది. నిత్యావసర వస్తువుల విక్రయాల తాలూకు డబ్బులు దుర్వినియోగం కారణంగా తాళం పడింది. వరుసగా ఐదు నెలలుగా షట్టర్ తాళాలు తెరుచుకోకపోవడంతో నెలవారీగా అరువుపై సరుకులు తీసుకెళ్లే కార్మికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. సరుకుల విక్రయాల్లో అవకతవకలకు పాల్పడిన సిబ్బందిపై చర్యలు తీసుకుని యధాతథంగా సూపర్‌బజార్ నిర్వహించాల్సి ఉండగా ఉన్నతాధికారులు పట్టింపు లేకుండా వ్యవహరిస్తున్నారు. కార్మికుల పక్షాన కనీస ఆలోచన చేయకుండా ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నెలవారీగా రూ.లక్షల్లో వ్యాపారం

క్రెడిట్‌పై తక్కువ ధరకు నాణ్యమైన సరుకులు అందించాలనే సంకల్పంతో సింగరేణి యాజమాన్యం బెల్లంపల్లి బజార్ ఏరియా పాతబస్టాండ్ ప్రాంతంలో కొన్నాళ్ల క్రితం సూపర్‌బజార్‌ను ప్రారంభించింది. ప్రైవేటు సూపర్‌బజార్లకు ఏమాత్రం తీసిపోకుండా ఆధునికంగా నిర్మించారు. గృహోపకరణ, నిత్యావసర సరుకులను అందుబాటులో ఉంచి ఇన్నాళ్లుగా విక్రయాలు సాగిస్తూ వచ్చారు. ఆసక్తి కలిగిన కార్మికులకు సూపర్‌బజార్‌లో సభ్యత్వం కల్పించారు. ఇటీవల చోటు చేసుకున్న పరిణామాలతో ఏకంగా సూపర్‌బజార్ మూసివేయడంతో కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మూసివేతకు గురికాక ముందు ప్రతీ నెల వంద మందికి పైగా కార్మికులు నిత్యావసర వస్తువులు కొనుగోలు చేసి తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. ఈ లెక్కన నెలవారీగా కనిష్ఠంగా రూ.6లక్షల నుంచి గరిష్ఠంగా రూ.8లక్షల వరకు వ్యాపారం సాగినట్లు సమాచారం. అంతకు కొన్నాళ్ల క్రితం ఏకంగా రూ.12.లక్షల వరకు సరుకులు విక్రయించినట్లు పేర్కొంటున్నారు. అంతటి వ్యాపారం కలిగిన సూపర్‌బజార్‌ను మూసివేయడంతో అటు యాజమాన్యానికి నష్టం కలిగే అవకాశాలు ఏర్పడగా.. ఇటు కార్మికవర్గం ఇబ్బందులు పడే పరిస్థితులు దాపురించాయి.

అవకతవకలు జరగడంతో..

సూపర్‌బజార్‌లో పని చేసిన ఓ సేల్స్‌మెన్ సరుకుల డబ్బులు స్వాహా చేసినట్లు ఆరోపణలు రావడంతో గత సెప్టెంబర్‌లో అధికారులు విచారణ చేశారు. సరుకుల డబ్బులు స్వప్రయోజనాలకు వాడుకున్నట్లు తేల్చారు. రూ.4లక్షలు లూటీ చేసినట్లు నిర్ధారించినట్లు తెలుస్తోంది. అక్రమాలకు పాల్పడిన సేల్స్‌మెన్ ఆ డబ్బులను రెండు నెలల వ్యవధిలో తీర్చినట్లు సమాచారం. కాగా, వెరిఫికేషన్ జరిగిన తర్వాత సెప్టెంబర్ 31నుంచి అర్ధంతరంగా, అనాలోచిత విధానాలతో సూపర్‌బజార్‌కు తాళం వేసి చోద్యం చూస్తున్నారు. కొత్తగా మరో సేల్స్‌మెన్‌ను నియమించకుండా, కార్మికులకు సరుకులు అందించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రత్యామ్నాయంగా కార్మికులు కిరాణ దుకాణాల్లో సరుకులు తీసుకెళ్లే పరిస్థితులు కల్పించారు. సేల్స్‌మెన్ లేరనే కారణంతో సూపర్‌బజార్ తెరవడం లేదు. మరోవైపు అందులోని సరుకులను మరో సూపర్‌బజార్‌కు అలాట్‌మెంటు చేసి విక్రయించే ఏర్పాట్లు చేయలేదనే విమర్శలు వస్తున్నాయి. నెలల తరబడి తాళం వేసి ఉండడంతో సరుకులు పాడయ్యే పరిస్థితులు ఉన్నాయి. కారణాలేవైనా కార్మికవర్గం ప్రయోజనాల దృష్ట్యా సూపర్‌బజార్ తెరిపించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. ఈవిషయమై శ్రీరాంపూర్ సింగరేణి సూపర్ బజార్‌డివిజనల్ మేనేజర్ బెరుగు సుదర్శన్‌ను ఫోన్‌లో సంప్రదించడానికి ప్రయత్నించగా స్పందించలేదు.



మూసి ఉన్న బెల్లంపల్లి సింగరేణి సూపర్‌బజార్

రవాణా శాఖ అధికారుల బదిలీలు



లెక్కల కిష్టయ్య, డీటీఓ



వివేకానంద్‌రెడ్డి, ఎంవీఐ



రాహుల్‌కుమార్, ఎంవీఐ



యోగేశ్వర్, ఎంవీఐ

- డీటీఓ సహా ముగ్గురు ఎంవీఐలు, ముగ్గురు ఏఎంవీఐలు
- జిల్లాకు ఖరారు కానీ డీటీఓ పోస్టు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో ఎట్టకేలకు సామూహిక బదిలీలు జరిగాయి. జిల్లా రవాణా శాఖా అధికారి(డీటీఓ)తోపాటు ముగ్గురు మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్లు, ముగ్గురు అసిస్టెంట్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్లు(ఏఎంవీఐ) బదిలీ అయ్యారు. జిల్లా రవాణా శాఖాలో దాదాపు ఎనిమిదేళ్లుగా బదిలీలు లేక రవాణా శాఖ చరిత్రలోనే డీటీఓ కిష్టయ్య, ఎంవీఐ వివేకానంద్‌రెడ్డి సీనియర్లుగా నిలిచారు. గత నెల రోజులుగా బదిలీలు జరుగుతాయని ఊహాగానాలు వెలువడుతుండగా రవాణా శాఖ కమిషనర్ శనివారం బదిలీలపై ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా కార్యాలయంలోని అధికారులందరినీ మూకుమ్మడిగా బదిలీ చేశారు. డీటీఓ లెక్కల కిష్టయ్య మలక్‌పేట ఆర్టీఓ కార్యాలయాలనికి బదిలీ అయ్యారు. డీటీఓగా 2016 డిసెంబర్ 16న బాధ్యతలు స్వీకరించిన ఆయన ఇక్కడ దాదాపు ఎనిమిదేళ్లుగా పని చేస్తున్నారు. సీనియర్ ఎంవీఐ గుర్రం వివేకానంద్‌రెడ్డి నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌కు బదిలీ అయ్యారు. 2016 డిసెంబర్ 24న ఎంవీఐగా రాగా ఆయన కూడా దాదాపు ఎనిమిదేళ్లుగా పని చేస్తున్నారు. మరో ఇద్దరు ఎంవీఐలు ఎనగందుల రాహుల్‌కుమార్, జాదవ్ యోగేశ్వర్ కూడా బదిలీ అయ్యారు. వీరిద్దరూ 2020 డిసెంబర్ 8న పదోన్నతిపై మంచిర్యాలకు బదిలీపైగా రాగా ప్రస్తుతం ఎంవీఐ రాహుల్‌కుమార్ నిజామాబాద్ డీటీఓ కార్యాలయానికి, యోగేశ్వర్ సత్తుపల్లి ఆర్టీఓ కార్యాలయానికి బదిలీ అయ్యారు.

ఏఎంవీఐలు సైతం..

డీటీఓ కార్యాలయంలోని నలుగురు ఏఎంవీఐలూ బదిలీ అయ్యారు. ఏఎంవీఐ కొమ్ము శ్రీనివాస్ కామారెడ్డి చెక్‌పోస్టుకు, నల్ల ప్రత్యూషారెడ్డి ఆదిలాబాద్ డీటీసీ పరిధిలోని భోరజ్ చెక్‌పోస్టుకు, శ్రీకాంత్ నిజామాబాద్ జిల్లా సాలూర చెక్‌పోస్టుకు బదిలీ అయ్యారు.

ఇంకా ఖరారు కాని డీటీఓ?

మంచిర్యాల డీటీఓ నియామకంపై ఇంకా ఎలాంటి స్పష్టత రాలేదు. ఇక బదిలీ అయిన ఎంవీఐల స్థానంలో నూతన ఎంవీఐలు నియామకం అయ్యారు. ఎంవీఐలుగా ఆసిఫాబాద్ డీటీఓ కార్యాలయం నుంచి టి.సంతోశ్‌కుమార్, రాజన్నసిరిసిల్ల జిల్లా డీటీఓ కార్యాలయం నుంచి కిషోర్‌చంద్రరెడ్డి, కోరుట్ల ఆర్టీఓ కార్యాలయం నుంచి రంజిత్‌రెడ్డి రానున్నారు. బదిలీ అయిన ముగ్గురు ఏఎంవీఐల స్థానంలో ఒకరిని మాత్రమే నియమించారు. జగిత్యాల డీటీఓ కార్యాలయం నుంచి ఖాసిమ్ మంచిర్యాల డీటీఓ కార్యాలయానికి ఏఎంవీఐగా బదిలీపై వస్తున్నారు. డీటీఓగా ఇంకా ఎవరికీ కూడా పూర్తిస్థాయి బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు వెలువడలేదు. ఆసిఫాబాద్ జిల్లా డీటీఓ రాంచందర్‌కు మంచిర్యాల డీటీఓ ఇంచార్జీగా నియమించనున్నట్లు తెలుస్తోంది.

క్లుప్తంగా

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



పోలీస్‌స్టేషన్‌లో ఇసుక ట్రాక్టర్లు

లింగాపూర్: అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను శనివారం తెల్లవారు జామున పట్టుకున్నట్లు ఎస్సై కొట్టె ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఇసుకకు సంబంధించిన పత్రాలు లేకపోవడంతో తహసీల్దార్ రాజేంద్రప్రసాద్ ఎదుట బైండోవర్ చేశారు. ఒక్కో ట్రాక్టర్‌కు రూ.5వేల చొప్పున మూడు ట్రాక్టర్లకు రూ.15వేలు జరిమానా విధించినట్లు తహసీల్దార్ తెలిపారు.

బీజేపీ జాతీయ కౌన్సిల్‌లో రఘునాథ్


పాల్గొన్న జిల్లా అధ్యక్షుడు రఘునాథ్

మంచిర్యాలటౌన్: ఢిల్లీలోని భారత మండపంలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపి నడ్డా అధ్యక్షతన నిర్వహిస్తున్న పార్టీ జాతీయ కౌన్సిల్ సమావేశంలో బీజేపీ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి పాల్గొన్నారు. దేశంలో ఎన్డీఏ కూటమి 400లకు పైగా సీట్లు సాధించి, మూడోసారి కేంద్రంలో అధికారంలోకి రావడమే లక్ష్యంగా పనిచేయాలని మోదీ, జెపీ నడ్డాలు దిశా నిర్దేశం చేసినట్లు తెలిపారు. జిల్లా నుంచి పెద్దపల్లి పార్లమెంటు కన్వీనర్ నగునూరి వెంకటేశ్వర్ గౌడ్, జాయింట్ కన్వీనర్ మల్లికార్జున్, ఆరుముళ్ల పోషం పాల్గొన్నారు.

గూడెం.. గూడు కట్టుకుంది!

ఆదివాసీలు సంస్కృతి, సంప్రదాయాలకు పెద్దపీట వేస్తారు. కట్టుబాట్లకు కట్టుబడి పని చేస్తారు. కానీ ఓ గూడెంలో పట్టు తప్పిన పటేల్‌ను కాదని ఊరే తరలిపోయింది. కొత్తగా గూడెం నిర్మించుకుంది. దీంతో ఆ గూడెంలో కట్టుబాట్లు పెట్టిన పటేల్, ఆయన బంధువు మాత్రమే మిగిలారు. గూడెం మొత్తం తరలిపోయి కొత్త గూడెం నిర్మించుకోవడంతో పాత గూడెంలో మొండి గోడలతో శ్మశాన వాతావరణం తలపిస్తోంది. కొత్త గూడెం కొత్త సంస్కృతి, సంప్రదాయాలు, కట్టుబాట్లతో కళకళలాడుతోంది. ఆదిలాబాద్ జిల్లా సిరికొండ మండలం పాండుగూడ.. కోసుపటేల్‌గూడగా మారిన తీరుపై ప్రత్యేక కథనం.

– ఇచ్చోడ(బోథ్)

సండే స్పెషల్


నూతనంగా ఏర్పాటు చేసుకున్న కోసుపటేల్‌గూడ

- పటేల్‌ను కాదని.. సొంతంగా ఊరు పొందిక
- రూ.25 లక్షలతో ఆరు ఎకరాలు కొనుగోలు..
- 28 నివాసాలు.. బడి, గుడి నిర్మాణం
- పాండుగూడ.. కోసుపటేల్ గూడగా..

కట్టుబాటుకు కట్టుకున్న ఇండ్లు వదిలి..

ఆదిలాబాద్ జిల్లా సిరికొండ మండలంలోని మారుమూల గిరిజన గ్రామం పాండుగూడ. అక్కడ నివసించే వారంత ఆదివాసీలే. ప్రశాంత వాతావరణంలో వ్యవసాయం చేస్తూ జీవనం సాగించే ఆదివాసీలకు మూడేళ్ల క్రితం కట్టుబాట్లు అడ్డువచ్చాయి. గూడెంలోని గ్రామ పటేల్‌కు, గ్రామస్తులకు పొసగడం లేదు. మూఢనమ్మకాలు, గ్రామలెక్కలపై వివాదం తలెత్తింది. దీంతో అప్పటి వరకు కలిసి కట్టుగా ఉన్న గూడెంలో ఒక్కసారిగా వివాదం మొదలైంది. గ్రామస్తులంతా ఒకవైపు, పటేల్.. ఆయన సమీప బంధువు కుటుంబం మరోవైపు అయ్యాయి. ఆదివాసీ సంఘులు, సార్‌మేడిల కుల పెద్దల ద్వారా పంచాయితీలు కూడా పెట్టుకున్నారు. కానీ పరిష్కారం దొరకకపోగా సమస్య మరింత జటిలమైంది. గ్రామస్తులంతా పటేల్‌ను వ్యతిరేకించడంతో తమ పట్టా భూముల్లో ఇళ్లు కట్టుకున్న వారంతా ఖాళీ చేసి వెళ్లిపోవాలని పటేల్ ఆదేశాలు జారీ చేశారు. దీంతో 28 ఆదివాసీ కుటుంబాలు తాము నిర్మించుకున్న ఇళ్లను సైతం ఖాళీ చేసి పిల్లాపాపలతో, కట్టుబట్టలతో గూడెం ఖాళీచేసి వెళ్లిపోయారు.

కోసుపటేల్‌గూడ ఏర్పాటు

పాండుగూడ నుంచి ఇళ్లు ఖాళీ చేసి వెళ్లిపోయిన ఆదివాసీలు మొక్కవోని ధైర్యంతో మరో గూడెం ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. కుటుంబానికి లక్ష రూపాయల చొప్పున జమ చేసి ఆరెకరాల వ్యవసాయ భూమిని రూ.25 లక్షలకు కొనుగోలు చేశారు. నూతనంగా గూడెం ఏర్పాటు చేసుకుని 28 కుటుంబాలు తాత్కాలికంగా ఇళ్ల నిర్మాణం చేసుకున్నారు. కోసు పటేల్ గూడగా నామకరణం చేశారు. గూడేనికి నూతనంగా పటేల్, దేవారి, మహాజన్, పూజారిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

పాడుబడిన పాండుగూడ...

పాండుగూడను విడిచి 28 కుటుంబాలు వెళ్లి పోవడంతో ఆగూడెం పాడుబడిపోయింది. గూడెంలో మొండిగోడలు దర్శనమిస్తున్నాయి. గూడెంలో పటేల్‌తో పాటు మరో కుటుంబం మాత్రమే నివాసం ఉంటున్నారు. పాండుగూడలో ఉన్న పాఠశాల, ఓవర్‌హెడ్ ట్యాంకు మూతబడి పోయాయి.


పాండుగూడలో పటేల్ నివాసం ఉంటున్న ఇల్లు


ఆదివాసీలు వెళ్లిపోవడంతో ఖాళీ అయిన పాండుగూడ

ట్రస్టు ద్వారా పాఠశాల నిర్మాణం..


అభినవ్‌సర్దార్ ట్రస్టు ద్వారా కోసుపటేల్ గూడలో నిర్మించిన పాఠశాల

నూతనంగా ఏర్పడిన కోసు పటేల్ గూడలో మూడెళ్ల నుంచి పాఠశాల భవనం లేదు. దీంతో రేకుల కొట్టంలో పాఠశాల నిర్వహిస్తున్నారు. విషయం తెలుసుకున్న అభినవ్ సర్దార్ ట్రస్టు చైర్మన్ అభినవ్‌సర్దార్ గ్రామాన్ని సందర్శించారు. రూ.3 లక్షల ఆర్థికసాయం అందించి పాఠశాలకు భవనం నిర్మించి ఇచ్చారు. దీంతో కోసుపటేల్ గూడలో ఆదివాసీ విద్యార్థులు పాఠాలు నేర్చుకుంటున్నారు.

విద్యుత్ సౌకర్యం కల్పించాలి


కోసుపటేల్ గూడలో మూడేళ్ల నుంచి విద్యుత్ సౌకర్యం లేదు. ప్రభుత్వం స్పందించి మా గూడేనికి విద్యుత్ సౌకర్యం కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలి. ఆదివాసీ గ్రామాన్ని ఆదుకోవాలి.

– రావుజీ, కోసుపటేల్ గూడ గ్రామ పటేల్

తాగునీటి సౌకర్యం కల్పించాలి


మా గ్రామానికి ప్రభుత్వం తాగునీటి సౌకర్యం కల్పించాలి. ప్రస్తుతం మేమంతా కలిసి వేసుకున్న బోరు నీటిని తాగుతున్నాం. దీంతో చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. అధికారులు స్పందించాలి.

– కుంర యాదవ్‌రావు, కోసుపటేల్‌గూడ

ఇండ్లు మంజూరు చేయాలి


కోసుపటేల్ గూడలో ఒక్కరికి కూడా పక్కా ఇళ్లు లేవు. ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుని మా గ్రామానికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి.

– పెందుర్ భీంబాయి, కోసుపటేల్‌గూడ

అదృష్టంగా భావిస్తున్నా..


గిరిజన విద్యార్థుల చదువు కోసం కోసుపటేల్ గూడలో పాఠశాల నిర్మించే అవకాశం అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నా. నేను కూడా మారుమూల గిరిజన గ్రామాల్లో కిలో మీటర్ల దూరం వరకు కాలినడకన వెళ్లి చదువుకున్నా.

– అభినవ్ సర్దార్, ట్రస్టు చైర్మన్

పింఛన్ పునరుద్ధరించండి సారూ..


ఎల్ములు శేఖర్

పెంచికల్‌పేట్: మండలంలోని అగర్‌గూడకు చెందిన ఎల్ముల శేఖర్‌కు పుట్టుకతోనే కాళ్లు, చేతులు పనిచేయకపోవడంతో మంచానికే పరిమితమయ్యాడు. అతని ఆలనాపాలన చూసే తల్లి చంటమ్మ మూడేళ్లక్రితం అనారోగ్యంతో మృతి చెందింది. యువకుడి భారం అతని తండ్రి ఎల్ముల అంకులుపై పడింది. శేఖర్‌కు ప్రభుత్వం సదరం సర్టిఫికెట్ (19246470370120007) ద్వారా 2019 వరకు దివ్యాంగుల పింఛన్ ఇచ్చింది. పింఛన్ల ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా అతని తండ్రి అంకులు వృద్ధాప్య పింఛన్‌కు సదరం ఐడీ నంబర్ జోడించడంతో యువకుడి పింఛన్ నిలిచిపోయింది. పునరుద్ధరించాలని పలుమార్లు అధికారులకు వినతిపత్రాలు ఇచ్చినా నేటికీ సమస్య పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. కూలి పనులు చేసుకునే నాకు కుమారుడి ఆలనా పాలనా చూడటం భారంగా మారిందని, దివ్యాంగుల పింఛన్ పునరుద్ధరించి ఆదుకోవాలని యువకుడి తండ్రి అధికారులను వేడుకుంటున్నాడు.

ఐఐటీ మెయిన్స్‌లో మెరిసిన విద్యాకుసుమం


విజయ్

కోటపల్లి: మండలంలోని సుపాక గ్రామానికి చెందిన ముత్యం విజయ్ ఇటీవల విడుదలైన ఐఐటీ మెయిన్స్ ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ చాటాడు. ముత్యం సమ్మయ్య, మల్లక్క దంపతుల కుమారుడు విజయ్ ఐఐటీ మెయిన్స్ ఫలితాల్లో 98.9 తో ర్యాంకు సాధించాడు. ఐదోతరగతి వరకు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో, కాసిపేటలోని గురుకుల పాఠశాలలో పదో తరగతి పూర్తి చేసి ఇంటర్ చదువుతున్నాడు.

కోల్ సెక్రెటరీకి వినతులు


వినతిపత్రం ఇస్తున్న నాయకులు

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఓసీపీని సందర్శించిన సెంట్రల్ కోల్ సెక్రెటరీ అమ్రిత్‌లాల్ మీనాను శనివారం సింగరేణి ఆఫీసర్స్ అసోసియేషన్ (సీఎంఓఏఐ) నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గోదావరి పరీవాహక ప్రాంతంలోని బొగ్గు బ్లాకులను ఎలాంటి షరతులు లేకుండా సింగరేణికి కేటాయించాలన్నారు. ఇతర పెర్క్స్ అలవెన్సులు, కోల్ ఫీల్డ్ అలవెన్సులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇంకా ఇతర అధికారుల వృత్తి పరమైన సమస్యలు, జీతభత్యాల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో సీఎంఓఏఐ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ (అపెక్స్) ఏవీ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ సీహెచ్ శ్రీనివాస్, శ్రీరాంపూర్ ఏరియా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు కే కిరణ్‌కుమార్, ఎస్టీపీపీ అధ్యక్షుడు సముద్రాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఐఎన్టీయూసీ వినతి

అమ్రిత్‌లాల్‌ను మీనాను ఐఎన్టీయూసీ నాయకులు కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఐఎన్టీయూసీ కేంద్ర సీనియర్ ఉపాధ్యక్షుడు కాంపెల్లి సమ్మయ్య, బ్రాంచి ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు, నాయకులు భీంరావు, గరిగే స్వామి, వై.సత్యనారాయణ, బొడకుంట ప్రణయ్, గుడ్ల రమేశ్ పాల్గొన్నారు.

అనుమతుల మాటున అక్రమ రవాణా

- చెట్లపొదల్లో ఇసుక డంపులు
- అక్రమంగా తరలించి నిల్వ చేసుకున్న వ్యాపారులు
- స్వాధీనం చేసుకుంటే ప్రభుత్వానికి ఆదాయం


అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక డంపు

మంచిర్యాలక్రైం: ఇసుక డంపులు ఉండగా ఆన్‌లైన్ మాకేందుకు అన్న చందంగా వ్యాపారులు వ్యవహరిస్తున్నారు. ఇసుక అక్రమ రవాణకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. జనవరి 8న 'గోదావరిలో ఇసుక దొంగలు' అనే శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి కలెక్టర్ బదావత్ సంతోష్ స్పందించారు. మంగళవారం మైనింగ్ ఏడీ బాలుతో కలిసి మంచిర్యాల కాలేజీరోడ్, వేంపల్లి, పాతమంచిర్యాల, ముల్కల్ల గోదావరిలోని ఇసుక రీచ్‌లను పరిశీలించారు. అనంతరం కలెక్టరేట్‌లోని సమావేశపు హాల్‌లో మైనింగ్, రెవెన్యూ, పోలీస్ ఉన్నతాధికారులతో అత్యవసర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఓ కమిటీని ఏర్పాటు చేసి ఇసుక అక్రమ రవాణను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గతనెల 22న హాజీపూర్ మండలం వేంపల్లి గోదావరి నుంచి ఇసుక తీసుకునేందుకు మైనింగ్ అధికారులు అనుమతులు ఇచ్చారు. అంతకుముందే గోదావరి నుంచి వేలాది ట్రాక్టర్ల ఇసుకను తరలించి రహస్య ప్రాంతాల్లో డంపు చేసుకున్నారు.

అనుమతుల మాటున అక్రమ రవాణా

మైనింగ్ అధికారులు ఇసుక రీచ్‌లకు అనుమతులు ఇవ్వకముందే వ్యాపారులు వేలాది ట్రాక్టర్ల ఇసుకను డంప్ చేసుకుని పెట్టుకున్నారు. అంతా అయిపోయిన తర్వాత అధికారులు వేంపల్లి సమీపంలో గోదావరి నుంచి ఇసుకను తీసుకునేందుకు అనుమతులు ఇచ్చారు. ప్రభుత్వం అనుమతులు ఇచ్చిందని అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుకను తరలిస్తూ వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. అనుమతులు ఇచ్చామని అధికారులు నిమ్మకుండి పోతున్నారు.

ప్రభుత్వ ఆదాయానికి గండి

ప్రజల సౌకర్యార్థం ప్రభుత్వం వేంపల్లి గోదావరి నుంచి తీసుకునేందుకు ఆన్‌లైన్ అనుమతులు ఇచ్చింది. అయితే ఇసుక వ్యాపారులు ఆన్‌లైన్ ద్వారా ఇసుక కొనుగోలు చేయకుండా తాము ముందస్తుగా అక్రమంగా డంప్ చేసుకున్న నిల్వల నుంచి ఎక్కువ ధరలకు విక్రయిస్తున్నారు. దీంతో ప్రభుత్వ ఆదాయనికి గండి పడుతోంది. ఇసుక డంపులను రెవెన్యూ అధికారులు సీజ్ చేసి మైనింగ్ అధికారులకు అప్పగిస్తే ఆన్‌లైన్ ద్వారా ఇసుక విక్రయించేందుకు అవకాశం ఉంటుంది. దీంతో ప్రభుత్వానికి కొంతయినా ఆదాయం సమకూరే అవకాశం ఉంది. వేంపల్లి గోదావరి నుంచి ఇసుక అనుమతులు ఉన్నప్పటికీ నస్పూర్, మంచిర్యాల పట్టణ ప్రజలకు ఇసుక తరలింపు దూరం కావడంతో ఇసుక వ్యాపారులు సమీపంలోని గోదావరి నుంచి ఇసుకను తరలించి నిల్వ చేసుకుంటున్నారు.

రెవెన్యూ అధికారులు సీజ్ చేయాలి


ఇసుక డంపులను రెవెన్యూ అధికారులు సీజ్ చేసి మాకు అప్పగిస్తే ఆన్‌లైన్ ద్వారా ఇసుక డంపులను విక్రయించేందుకు అవకాశం ఉంటుంది. బహిరంగ ప్రదేశాల్లో ఉన్న ఇసుక డంపులను సీజ్ చేసే అధికారం మాకు లేదు. వేంపల్లి గోదావరి నుంచి ఇసుక అనుమతులు ఇచ్చాం. ఆన్‌లైన్ రిసిప్ట్ లేకుండా ఇసుక తరలిస్తే చర్యలు తీసుకుంటాం.

– బాలు, జిల్లా మైనింగ్ శాఖ అధికారి, మంచిర్యాల

విద్యార్థులకు కెరీర్ గైడెన్స్

మంచిర్యాలఅర్బన్: విద్యార్థి నేపథ్యం ఏదైనా ఉన్నత లక్ష్యం, ప్రణాళికతో ముందుకెళ్తే ఏస్థాయికైనా చేరుకోవచ్చని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ, ఉన్నత పాఠశాలల 8, 9, 10 తరగతుల విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు కెరీర్ గైడెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదోతరగతి తర్వాత ఏఏ కోర్సులు ఉంటాయి? ఏ లక్ష్యానికి ఏకోర్సు ఎన్నుకోవాలనే విషయాలపై వివరించారు. పోటీ పరీక్షలకు ఏవిధంగా సన్నద్ధం కావాలి? గ్రంథాలయాన్ని ఉపయోగించటం, రోజు వారీ న్యూస్ పేపర్ తప్పకుండా చదవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మారుతీప్రసాద్, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ సతీష్, ఏఈ మధుకర్, సెక్టోరల్ అధికారిశ్రీనివాస్,ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రెండు గంటలు ట్రాఫిక్ జామ్


బెల్లంపల్లి చౌరస్తాలో నిలిచిపోయిన వాహనాలు

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని బెల్లంపెల్లి చౌరస్తాలో శనివారం సాయంత్రం రెండు గంటల పాటు ట్రాఫిక్ జామ్ అయింది. నూతనంగా నిర్మించిన ఐలాండ్ వద్ద రోడ్డు మరమ్మతు పనులు చేయడం వల్ల వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రి సమయంలో మరమ్మతు పనులు చేయాలని కోరుతున్నారు.

కూలీలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి


టెక్నికల్ అసిస్టెంట్ల వివరణ వింటున్న అధికారులు

తాండూర్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కూలీలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని డీఆర్‌డీవో పీడీ కిషన్ అన్నారు. శనివారం మండల ప్రజాపరిషత్ కార్యాలయ ఆవరణలో 14వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. 2022–23 ఆర్థిక సంవత్సరానికి గానూ 2.82 కోట్ల రూపాయాలతో మండల వ్యాప్తంగా నిర్వహించిన 152 రకాల పనులపై సామాజిక తనిఖీ బృందం ప్రజా వేదికలో నివేదికలు చదివి వినిపించారు. గ్రామాల పరిధిలో మొక్కల పెంపకంలో ముఖ్యంగా మల్టీ లెవల్ అవెన్యూ ప్లాంటేషన్‌ల విషయంలో అజాగ్రత్త వహించినందుకు కార్యదర్శులకు, టెక్నికల్ అసిస్టెంట్లకు, ఫీల్డ్ అసిస్టెంట్లకు డీఆర్‌డీవో షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఎంపీపీ పూసాల ప్రణయ్‌కుమార్, జెడ్పీటీసీ సాలిగామ బానయ్య, ఎంపీటీసీలు రవీందర్‌రెడ్డి, శంకర్, ఏపీడీ దత్తారావ్, ఎంపీడీవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే పీడీయాక్ట్

నెన్నెల: నకిలీ విత్తనాలు విక్రయిస్తే పీడీయాక్ట్ కేసులు నమోదు చేస్తామని బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ అన్నారు. శనివారం నెన్నెల పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. పరిసరాలను పరిశీలించి 5ఎస్ అమలు తీరును పరిశీలించారు. ఇప్పటి వరకు స్టేషన్‌లో నమోదైన కేసులు, రికార్డులను పరిశీలించి, పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరగా పూర్తి చేయాలని సీఐ, ఎస్సైలకు సూచించారు. సిబ్బందికి ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. దొంగతనాలు జరుగకుండా చూసుకోవాలని ఎస్సై శ్యాం పటేల్‌ను ఆదేశించారు. గుడుంబా, గంజాయి, నకిలీ విత్తనాల తయారీపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో బెల్లంపల్లి, తాండూర్ సీఐలు అఫ్జలొద్దీన్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

భీమిని: నకిలీ విత్తనాలు విక్రయిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని ఏసీపీ రవి కుమార్ అన్నారు. శనివారం భీమిని పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిర్యాదుదారుల పట్ల సానుకూలంగా స్పందించాలన్నారు.


నెన్నెలలో రికార్డులు పరిశీలిస్తున్న ఏసీపీ

పోలీసు సిబ్బందికి ఏమైన సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.